
కరపత్ర అక్షరాలు,చిత్రక చూపులు కలిసి నడిచిన ప్రయాణం..!

# చిత్రక



ఏప్రిల్ సంచిక,2018

Chitraka

A PRAVARSH CAPTURE

# స్వాగతం

# సుస్వాగతం

Chitraka

A PRAVARSH CAPTURE

# ఈ నెల మిమ్మల్ని పలకరించబోయే చిత్రకవితలు ఇవే


0. పరిచయం 3

1. శిలాస్మృతులు 5

2. పనిలోన నా ధ్యాస పట్టు తప్పదే... 7

3. ఊపిరి ఊయల ఊగక తప్పదుగా...! 9

4.కళల కుటీరం 11

5. బొమ్మలే మాకు అమ్మలు 13



సమస్త పాఠక వీక్షక ప్రపంచానికి ఇదే మా పదచిత్ర నమస్కారం..

ఇక్కడ 'మా' అని సంభోదించామని ఆశ్చర్యపోకండి..!
అవును మేము ఇపుడు ఒక్కరం కాదు ఇరువురం..
ఎవరా అనే కదా మీ సందేహం,నాకు తెలుసు..అందుకే కదా ఈ పరిచయ పుట..
నా పేరు మీకేలాగో తెలుసు కదా కరపత్ర..ఇదిగో నా మిత్ర చిత్రక.
మధురమైన భావాలని మనసుని మీటేలా మృదువైన పదాలలో మథించి రచించడం
ఈ కరపత్ర వృత్తి అయితే..
కేవలం కంటికింపుగా మాత్రమే కాకుండా మనసు లోతుల్ని తాకి చూడగల
అందమైన సందర్భాలని అద్భుతమైన చిత్రాలుగా విరచించడం
ఈ చిత్రకకు సంతృప్తి..

అందుకే మా కళలు వేరైనా మా కళాహృదయాలు ఒకటేనని
నిరూపిస్తూ నవ్వినదే మా ఈ సంగమం..
చెరొక కన్నుగా మారి ఒకే చూపుగా పయనించాలనేదే మా మనోభీష్టం..
చిత్రక కన్ను,కరపత్ర పెన్ను కలిసి ఇకపై మీకందించబోతున్నాయి
మరచిపోలేని మధురమైన చిత్ర కవితలెన్నో..

ఆ చిత్ర కవితల గమనానికి నాందిగా..

మా స్నేహ బాంధవ్యానికి ఆదిగా..

చిత్రక ఈ మధ్య తన కెమెరాలో చిత్రించిన కొన్ని సహజమైన చిత్రాలకి,

ఈ కరపత్ర తన మనోరంజకమైన పదభావజాలాన్ని జతచేసి

ఈ రెండవ సంచికని మీకు అందజేయడం జరిగింది..

ఇక ఆలస్యమెందుకు..! పదండి..!

సంభ్రమపూరిత చిత్రాలని వీక్షిస్తూ,

స్వచ్ఛమైన భావాలని పఠిస్తూ..

ఆస్వాదిస్తూ,ఆనందిస్తూ,ఆలోచిస్తూ

మాలో ఒకరిగా

మాతో ఒకరిగా

మన ప్రయాణాన్ని మొదలుపెడదాం

ఇట్లు..

మీ కరపత్ర

తన మిత్ర

చిత్రకతో..

# శిలాస్మృతులు



పుట్టినా సరే చలనం లేని అణువుల కలబోతను
మరణం లేని వరం పొందిన శాపగ్రస్తురాలను
కఠినత్వానికి పోలికగా సరితూగే ఉదాహరణను
కన్నీరొచ్చినా కార్చలేని కళ్ళు లేని వికలాంగను నేను

భగభగ మంటల నవ్వుల ఆ అగ్నిబిలం నా తల్లి
బరువనుకోక బ్రతుకంతా మోసే ఈ నేలే నా తండ్రి
అవసరానుగునంగా వాడుకునే జీవులే నా బంధువులు
అయిన ఎవ్వరి అప్యాయతకి నోచుకోని అనాథను నేను

నాలో ఆ దేవుడు నిదరోతున్నాడని అన్నాడు ఒకడు
నన్ను ఒళ్ళంతా నరికి ఆ దేవుడిని లేపాడు మరొకడు
నన్నే నమ్మి కొలుస్తూ మంచి చెయ్యాలనుకున్నారు మొదట
నేడు నన్నే సాక్షిగా నిలిపి చేసేటి తప్పులెన్నో అంతట

పొలం గట్టు కాడ నేనొక తప్పస్సు చేసేటి ప్రకృతి ఉపాసకుడిని
చెరువు గట్టు కాడ అందరి మలినాలని కడిగేటి ఓ వైద్యుడిని
నట్టింట పచ్చడుల ఘుమఘుమలు నూరేటి వంటింటి మిత్రని
పెళ్ళి ఇంట పసుపు కొమ్ముల పైన నాట్యమాడేటి రోలు మంజరిని

కాలం కర్కషంగా ఉలితో సుత్తితో తనువంతా తొలుస్తున్నా
తలబడి నిలబడి బలపడి రకరకాల హావాభావలల్లుకొని
రాజునై,రాజకీయ నాయకుడినై,భగవంతుడినై,కళాకారుడినై
గుళ్ళల్లో,బళ్ళల్లో,ఊరి నడి మధ్యలో నిలిచా దిశా నిర్దేశకురాలినై

ఊపిరి లేదు కదా నాకు,కానీ గాలి కలుషితం కాదు నా వల్ల
తిండి వద్దు నాకు,కానీ నేలకి హాని చేయను నేను యే వేళా
ప్రాణం ఉందో లేదో తెలీదు,అయిన ప్రకృతి పాడు కానివ్వనలా
మరి అన్నీ అవసరమున్న మనుషులకి ఈ కల్మష కృత్యాలేలా

మాట లేదు నాకు నిజమే,కానీ మనసు మాట నన్నడగకు
కదలిక లేదు నాకు నిజమే,కానీ కాలం గురించి నన్నడగకు
నిర్దిష్ట రూపమంటు లేదు,నిజమైన అందం అంటే నన్నడగకు
పొరబడి నువ్వడిగినా సరే పొరపాటున కూడా బదులు వెతకకు

**<u>పనిలోన నా ధ్యాస పట్టు తప్పదే</u>**



మూడు ముళ్ళు మెడన మోస్తున్న నా సతి
ఎడడుగులు వెంట నడయాడిన ధర్మపత్ని
నేడు నా మట్టింటి మందిరాన మంచంపైన
ఒట్టిపోయిన ఒంటితో ఒంటరి పోరాటమాడె
రకరకాల మందులే రాటుదేలిన ఆయుధాలుగా
అయిన పనిలోన నా పట్టు ధ్యాస తప్పదే.. ?

పైరులా ఎదిగి పంటకొస్తున్న నారు, నా కొడుకు
ఊరు దాటె యేరు దాటె ఎత్తు సదువుల కొరకు
ఎల్లిపాయె నగరికి,రేపటి వాడి భవిత నిర్మాణానికి
యేడాదికోసారి వాడి కళాశాలకు కాసుల ఆకలి
నెలకొక్కసారి నా బిడ్డ బతుకు మనుగడకి ఆకలి
అయిన పనిలోన నా పట్టు ధ్యాస తప్పదే.. ?

వద్దు వద్దంటున్నా ప్రతి యేడు పెరిగిపోయేటి వయసు
మూట కట్టుకుంటున్నా జారిపోతున్న ఒంటి కుదురు
వాడిపోయి ఒరిగిపోతుంది వెన్ను,మసకబారింది కన్ను
నరాల నాళాల ఎరుపు నీరు ఇంకి ఒళ్ళంతట వణుకు
ఆపలేక ఊగుతున్న పైబడ్డ భాధ్యతలకు పైబడ్డ వయసుకు
అయిన పనిలోన నా పట్టు ధ్యాస తప్పదే.. ?

కష్టముందని తెలిసి కడుపు ఆకలిని మరచునా
కన్నీల్లున్నాయని కనులు నిదుర మరచిపోవునా
జేబు ఖాళీ ఉందని అప్పు వడ్డీ పెంచడమాపునా
చావు వస్తుందని తెలిసి బ్రతుకు భయపడి ఆగునా
ఏది ఏమైనా సరే ఏదీ ఆగదు కదా మారదు కదా
అందుకే పనిలోన నా ధ్యాస పట్టు తప్పదు

నాకంటు ఎటువంటి కమ్మని కలలు లేవు
ఉన్నదల్లా కడుపు నింపు ఈ కళ ఒక్కటే
నీడనిచ్చే గూడుకైనా,బ్రతకనిస్తున్న కూడుకైనా
ఆధారమైన ఆ దారమొకటె ఈ కళ ఒక్కటే
అందుకే యే కష్టమున్నా కన్నీళ్ళు ఉన్నా
కళామతల్లి కన్నతల్లి ఎదుట నే కర్మబంధుడినే

<u>ఊపిరి ఊయల ఊగక తప్పదుగా...!</u>





బతుకే ఓ ఆటలా మారిన మాకు
అలసట పాట కొత్త కాదు కదా
ఐనా సరే ఆడటం తప్పదుగా

పగలు రాతిరి భేదం కనులకు కానీ
కడుపు నింపే పనులకు కాదు కదా
ఐనా సరే శ్రమించడం తప్పదుగా

రాతియుగం మనకి ఆది అంటామే
రాతితో చెలిమే మా బ్రతుకంటాము
ఐనా సరే తొలచడం తప్పదుగా

గుడిలోన పూజలందుకునే దేవుళ్ళు
నడిరోడ్డులో నిలిచిన జనారాధకులు
ఐనా సరే ఉలిదెబ్బ తప్పదుగా

చెక్కుతున్నప్పుడు కారిన చెమట చుక్కలు
గురి తప్పి వేలు చివరన నెత్తుటి చుక్కలు
ఐనా సరే భరించి చరించడం తప్పదుగా

నాడు పలకలు పట్టి సాగలేదు మా చదువు
నేడు శిలాఫలకాలపై కదిలే మా ఉలి కలము
ఐనా సరే నేర్చుకోవడం తప్పదుగా

తక్కువనుకోము మాకు మేమెప్పుడూ
ఎక్కువనుకోము ఎవరినీ ఎప్పుడూ
ఐనా సరే లోకం పోలిక తప్పదుగా

ఆశయాలు మోయలేని మనసులు మావి
ఆశలు తీర్చుకోలేని బతుకులు మావి
ఐనా సరే ఊపిరి ఊయల తప్పదుగా

## కళల కుటీరం





మాకంటూ లేదు ఏ సొంత ఊరు
మాకు పని కుదిరిన చోటే మా ఊరు
మాకంటూ లేదు ఏ సొంత ఇల్లు
మా గుడారాలే మాకు భవంతులు

మాకు టిఫిన్లు,లంచులు,డిన్నర్లు
అంటూ పలురకాల పేర్లు ఉండవు
ఏ పూట అయినా ఆకలి రోగానికి
ఉడికి ఉడకని ఆ అన్నమే మందు

పండుగలంటూ పుట్టినరోజులంటూ
కొత్తబట్టలు కట్టు ఆచారాలు లేవు మాకు
మహా అయితే మాసిన బట్టలకు ఉతుకు
చిరిగిన బట్టలకు మెరిసేటి కొత్త అతుకు

చదువు కోసం బడికెళ్లాలని మా పిల్లలు అడగరు
అడిగినా సరే పంపగలిగే వారు మాలో కొందరు
తక్కిన పిల్లలు ఆటలలోనే కష్టం మరచి పెరుగుతారు
అమ్మానాన్నల కష్టంలోనే బతుకు పాఠాలు చదువుతారు

మా కళ్ళల్లో కలలు కన్నీళ్లు చెరో సగం
మా మనసుల్లో ఆశలు,నిరాశలు చెరో సగం
మా పనుల్లో సహజత్వం,కృత్రిమత్వం చెరోసగం
మా జీవితాలలో కష్టపడటం,కష్టాలు పడటం చెరోసగం

ఆకలి కోడికూతై మమ్ము నిదురలేపుతుంది
అలసట జోలపాటలా నిదుర పుచ్చుతుంది
ఆ వేకువకీ వెన్నెలకీ నడుమ మమ్ము నడుపుతుంది
నేటి అవసరాలపై పోరాటం,రేపటి ఆశలపై ఆరాటం

పేదరికం కాదు మాది అదోరకం పెద్దరికం
వలసజీవులం కాదు మేము విహారప్రియులం
మట్టిమనుషులమే కాదు మట్టిని నమ్మిన వాళ్ళం
దేవుడిని సైతం బొమ్మగా చేయగల దేవుడి బొమ్మలం

## బొమ్మలే మాకు అమ్మలు



కాలం నడకని అనుసరిస్తూ
ప్రకృతికి ఆరు ఋతువులు
లోకం నడకని అనుసరిస్తూ
మా వృత్తికి ఎన్నో ఋతువులు

ఒక్కో ఋతువుకి ఒక్కో వాతావరణం
ఎలా ప్రకృతి ఒడిలో పరిమళిస్తుందో
ఒక్కో కాలానికి ఒక్కో అవతరణం
మా చేతి అంచుల్లో ప్రతిబింబిస్తుంది

అమ్మచేతుల్లో బొమ్మైన ఆ వినాయకుడు
భాద్రపదమాసానికి ఆరునెలల మునుపే
మా చేతుల్లోని కళతో రకరకాల ఆకృతులతో
అలంకారాలతో ప్రతిమవుతాడు ప్రతీయేడు

నవరాత్రుల వేడుకకి నాలుగు మాసాలకు మునుపే
అమ్మల గన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ
మా గుడారాలే గుడులుగా మా మట్టిపనే పూజలుగా
మనసారా కొలువై మా కళలో నెలవై మూర్తీభవిస్తుంది

నట్టింటిలోన బొమ్మలకొలువులు చేసేవారు కొందరు
వారి కోసమే రామాయణ,భారత,భాగవతాల బొమ్మలు
మట్టిబొమ్మలనే అలంకరణగా చూసేవారు కొందరు
వారి కోసమే అందమైన అల్లిబిల్లి ఆట బొమ్మలు

ఏడాదిలో ఈ పండుగలు పన్నెండు అనుకున్న
రోజుకు మూడు పూటల ఆకలి తీర్చగలవా
లాభనష్టాల తూకంలో బరువనేది ఎటు ఉన్నా
మా జేబులు నిండు రోజులు మే చూడగలమా

మా కలల్లో ప్రాణం పోసుకున్న ఆలోచనలు
మా కళల్లో రూపుదిద్దుకున్న ఆకృతులు
మా చేతుల్లో అమ్ముడైపోయిన ఆ బొమ్మలు
మా ఆకలి అనుక్షణం మ్రొక్కేటి అమ్మలు

~ శుభం ~

ముందుగా మా ఈ చిన్ని ప్రయత్నాన్ని
ప్రోత్సహిస్తున్న ప్రతి మనసుకు
కృతజ్ఞతలు తెలుపుతూ

మీ
మంచి ఆరోగ్యాన్ని
మరిచిపోలేని ఆనందాన్ని
సదా కోరుకుంటూ

రాబోయే మాసపు సంచికలో
మరిన్ని చిత్ర కవితలతో
మళ్ళీ మిమ్మల్ని కలుసుకుంటామని
మాట ఇస్తూ ఇక సెలవు



మీ విలువైన అభిప్రాయాలని మాతో పంచుకోవాలనుకుంటే
ఈ క్రింది మెయిల్ రూపంలో మేము సదా మీకు సన్నిహితమే

~ Karapatra4u@gmail.com ~

Chitraka
A PRAVARSH CAPTURE


Chitraka
A PRAVARSH CAPTURE
కలల నిలయం
కళల ఆలయం
మా
చిత్రక & కరపత్రల
చిరు సంగమం